క్లుప్తంగా

బీమా సాయం అందజేత

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన దొండపాటి ప్రసాద్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకంలో మంజూరైన మొత్తంలో తక్షణ సాయంగా రూ.10 వేలు సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు బుధవారం అందజేశారు. ప్రసాద్ ఇటీవల ఒక ప్రమాదంలో మృతి చెందినట్టు, మంజూరైన మొత్తం రూ.లక్షలో తక్షణ సాయంగా రూ.10 వేలు ఇచ్చినట్టు, మిగిలిన రూ.90 వేలు వారి ఖాతాలో జమకానున్నట్టు ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నల్లి బాలరాజు, కార్యదర్శి గంగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

అంబాజీపేట: ఎస్సీ వర్గీకరణతో పాటు దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు పిలుపునిచ్చారు. అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చుట్టుగుళ్ల రాంబాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. విశ్వరూప మహాసభను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నవరపు భైరవమూర్తి, ఉందుర్తి నాగబాబు, తొత్తరమూడి హృదయకృష్ణ, నవుండ్రు వెంకటరమణ, కొల్లి సుధాకర్, మందా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగుతో ఆదాయం

అంబాజీపేట: చేల గట్లపై అపరాల సాగు చేయడం వల్ల అధిక ఆదాయంతో పాటు భూసారం పెరుగుతుందని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ బి.సౌజన్య అధ్యక్షతన రైతులకు కంది విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేవతి మాట్లాడుతూ ప్రతీ రైతు తమ పొలంలో గట్లపై కంది విత్తనాలు వేయాలన్నారు. అపరాల సాగుకు ప్రతీ రైతు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ జి.పల్లయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు


బి.దొడ్డవరంలో చేపట్టిన పారిశుధ్య పనులు

మామిడికుదురు: గోదావరి ముంపు ప్రభావిత గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ముంపునీరు నిలిచిన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారు. బి.దొడ్డవరంలోని ఇందిరమ్మ కాలనీతో పాటు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సర్పంచ్ చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి కోటయ్య పారిశుధ్య పనుల్ని పర్యవేక్షించారు. అప్పనపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లో కూడా పారిశుధ్యం పనులు జోరుగా జరుగుతున్నాయి.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

అంబాజీపేట: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించి వాటి విలువలు తెలియజేయాలని ఎంఈఓ మోకా ప్రకాష్ అన్నారు. చిరతపూడిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంఈఓ సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పౌష్టికాహారం వాటి పంపిణీ వివరాలను టీచర్ వై.వి.నాగమణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 11 మంది బాలింతలకు, గర్భిణులకు వైఎస్సార్ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ఆత్రేయపురం: జాతీయ జెండా రూపకర్త స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాతిబుజ్జి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ నాతిబుజ్జి మాట్లాడుతూ పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమరయోధుడన్నారు. జాతీయజెండా రూపకర్త, జాతీయవాదని కొనియాడారు. కార్యక్రమంలో మండల పరిషత్ పర్యవేక్షకుడు టీవీ సురేంద్రరెడ్డి, ఏపీవో కె.విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు

ఆత్రేయపురం: ఇటీవల చోరీలు పెరగడంతో చోరీలు నియంత్రించేందుకు మండల ప్రజల భద్రత కోసం స్థానిక మహిళా పోలీసు, వలంటీర్ల సహాయంతో 15 వేల మందికి పైగా మండల ప్రజల వాట్సాప్ గ్రూపు అను సంధానం చేసి వీడియోస్ రూపంలో అవగాహన చేపడుతున్నట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. స్థానిక మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి నేరుగా భద్రతా అంశాలపై స్వయంగా అవగాహన కల్పిస్తారన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు

- వరద ముంపు పొలాల పరిశీలన
- రైతులకు ఉద్యానాధికారి సూచనలు


వానపల్లిలంకలో పంటలు పరిశీలిస్తున్న హెచ్ఓ కోటేశ్వరరావు, ఏఏబీ చైర్మన్ శ్రీనివాస్

కొత్తపేట: గోదావరికి ఉధృతంగా వరదలు వచ్చి లంక భూముల్లో పంటలు ముంపునకు గురైన నేపథ్యంలో ఆయా పంటల సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని స్థానిక ఉద్యాన అధికారి (హెచ్ఓ) గంటా కోటేశ్వరరావు రైతులకు సూచించారు. ఆయన మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, పలువురు వీహెచ్ఏలతో కలసి ఉద్యాన శాఖ స్థానిక సబ్ డివిజన్ పరిధిలోని పలు లంక ప్రాంతాల్లో పర్యటించి నీటిలో ఉన్న అరటి, కూరపాదులు, బొప్పాయి, పసుపు తదితర పంటలను పరిశీలించారు. ఆయా పంటల యాజమాన్యం గురించి హెచ్ఓ రైతులకు సూచనలు చేశారు.

అరటి తోటల యాజమాన్యం

- 3 నెలల వయస్సు కన్నా తక్కువ ఉన్న మొక్కలు 3 అడుగుల లోతు నీటిలో మునిగిపోతే నేల ఆరిన వెంటనే మరలా మొక్కలను నాటుకోవాలి
- అంతర సేద్యం చేసి మొక్కకు 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను మొక్కకు 2–3 సార్లు 20–25 రోజుల వ్యవధిలో వేయాలి.
- ఆకులు, గెలలపై 0.5 శాతం 13–0–45 (నీటిలో కరిగే ఎరువు మల్టి-కే) మందు వారం రోజుల వ్యవధిలో 3 నుంచి 5 సార్లు పిచికారీ చేయాలి
- సగం తయారైన గెల (75 శాతం లోపు పక్వానికి వచ్చిన గెల)లను ఎండిన అరటి ఆకులతో కప్పి ఉంచి 15 రోజుల్లోపు కోసి మార్కెట్ చేసుకోవాలి
- అరటి దుంపలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి లేదా బోర్డో మిశ్రమం ఒక శాతం దుంప చుట్టూ తడి చేటట్లుగా నేలలో పోయాలి.
- ఆకుపచ్చ తెగులును అరికట్టేందుకు ప్రాపికొనజోల్ 1 మిల్లీ లీటరు లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 1–2 సార్లు పిచికారీ చేయాలి.

కూరపాదుల సస్యరక్షణ

- పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గరగా మట్టిని ఎగదోయాలి.
- మొక్కలకు సరిపోయినంత ఆకులు, కొమ్మలు ఉన్నట్లయితే 0.3 శాతం 13–0–45 (నీటిలో కరిగే ఎరువు మల్టి-కే) లేదా 2 శాతం యూరియా ద్రావణాన్ని 2–3 సార్లు మొక్క తడిచేటట్లుగా వారం వ్యవధిలో పిచికారీ చేయాలి.
- కూరగాయల మొక్కలు కొత్తగా విత్తిన లేదా నాటినట్లయితే వాటిని తీసివేసి మరలా నాటుకోవాలి.

తమలపాకుల సంరక్షణ

- లేత లేదా ముదురు తమలపాకు తోటల్లో వంగిన అవిశెలను లేపి తీగల మొదలు దగ్గర మట్టిని ఎగదోయాలి.
- తీగ నాటిన తోటల్లో అవిశెలను పలచన చేసుకుంటే తేమ త్వరగా ఆరిపోతుంది.
- తోటల్లో తెగిన తీగలను త్రుంచివేసి 1 శాతం బోర్డో మిశ్రమం లేదా 0.3 శాతం (3 గ్రాములు ఒక లీటరు నీటికి చొప్పున) పిచికారీ చేయాలి.
- మొక్కతోటలో తీగలను 0.5 శాతం బోర్డో మిశ్రమం, 500 పీపీఎం (స్ట్రెప్టోసైక్లిన్) ద్రావణంలో 15 నుంచి 30 నిమిషాలు ముంచి నాటుకోవాలి.
- తీగ పాదుల్లో 1 శాతం బోర్డో మిశ్రమాన్ని లేదా 0.3 శాతం కాపర్ ఆక్సిక్లోరైడ్‌ను మట్టి పూర్తిగా తడిచేలా పోయాలి. అలాగే ఇంకా వివిధ పంటల సస్యరక్షణ గురించి వివరించారు.

ఇజ్రాయెల్‌కు సన్మానం


బొమ్మి ఇజ్రాయెల్‌ను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మలికిపురం: మండలంలోని లక్కవరంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో బుధవారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాజోలులో వైఎస్సార్ సీపీయే గెలవాలని అన్నారు. స్థానిక జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పెమ్మాడి సోమరాజు, ముస్కూడి భాస్కరరావు, శెట్టెం శ్రీను, ఉల్లంపర్తి రమేష్, లంక సురేష్, చాట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో ఈ నెల 6 తేదీ నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు సేవా సమితి సభ్యుడు మన్యం వర్ధనరావు బుధవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి కంప్యూటర్ డీసీఏ కోర్సులు నేర్పబడునన్నారు. శిక్షణ తీసుకునే వారు ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక సత్యసాయి సేవాకేంద్రంలో జరిగే అవగాహన సదస్సులో పాల్గొని, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

అధికారుల గైర్హాజరుపై నిరసన


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ వీరాంజనేయులు

మామిడికుదురు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశం ఆద్యంతం వాడీవేడిగా జరిగింది. సభ్యులు మాట్లాడుతూ కొన్ని శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి రావడం లేదు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానాలు చేస్తున్నాం. కానీ ఫలితం మాత్రం ఉండడం లేదు. పరిస్థితులు ఈ విధంగా ఉంటే మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించడం ఎందుకు? మొక్కుబడికా అంటూ సభ్యులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖకు సంబంధించి పలు సమస్యలు ఉన్నాయి. వాటిపై చర్చించాల్సి ఉంది. కానీ రెండు మూడు సమావేశాల నుంచి ఇరిగేషన్ ఏఈ కోసం చూస్తున్నాం. కానీ అతను రావడం లేదు. ఇలా అయితే ఎలా! అంటూ మండిపడ్డారు. ఆదుర్రు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉందని దానికి కనీసం మరమ్మతులైనా నిర్వహించాలని సర్పంచ్ అడబాల తాతకాపు, బళ్ల శ్రీనివాసరావు కోరారు. అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల భర్తీ సమాచారం కనీసం గ్రామ పంచాయతీలకు కూడా తెలపడం లేదని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు వాపోయారు. విద్యుత్ లోఓల్టేజీ, తరచూ సరఫరా నిలిచిపోవడంపై ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటితో పాటు పలు సమస్యలు చర్చకు వచ్చాయి. సమావేశంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఉపాధ్యక్షురాలు భూపతిరాజు లక్ష్మి, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సకు ఆర్థికసాయం


బాధితురాలికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో ఉన్న ఒక మహిళకు శస్త్ర చికిత్స నిమిత్తం రూ.15 వేల నగదు సాయాన్ని అందజేసినట్టు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు బుధవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకి చెందిన కుంచే కరుణ కుమారి వృద్ధ తల్లిదండ్రులు, తన ఇద్దరు కుమార్తెలతో జీవిస్తోంది. వారందరికీ ఈమే ఆధారం. ఆమెకు అనారోగ్యంతో గర్భసంచిలో ఉన్న కణితి ఇన్ఫెక్షన్ కారణంగా ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించాలని వైద్యులు సూచించారు. ఈ ఆపరేషన్‌కు సుమారు రూ.60 వేల వరకూ ఖర్చవుతుందన్నారు. ఆమె ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఇబ్బందులు పడుతుందని ఆమెకు సాయం చేయాలని సేవా సమితి సభ్యులను కోరారు. దీంతో కుమారి వైద్యఖర్చుల నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు.

పాడి రైతులకు దాణా పంపిణీ


రైతులకు దాణా పంపిణీ చేస్తున్న ఏడీ అనిత

అయినవిల్లి: వరదలకు పశువుల మేత లేక అలమటిస్తున్న నేపథ్యంలో రైతులకు మండలం పశు వైద్యశాల వద్ద ప్రభుత్వం ఉచిత దాణా సరఫరా చేసింది. అయినవిల్లి మండలంలోని కొండుకుదురు, పొట్టిలంక, శానపల్లిలంక, తొత్తరమూడిలోని కె.పెదలంక, వీరవల్లిపాలెం, చింతనలంక గ్రామాల్లోని పాడి రైతులకు ఉచిత దాణాను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలంలోని 21 టన్నుల దాణాను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రేవంత్, పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

రామరాజులంకలో..

మలికిపురం: మండలంలోని రామరాజులంకలో వరద కారణంగా ఇబ్బంది పడుతున్న పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. 3.5 టన్నుల దాణాను పంపిణీ చేసినట్లు తహసీల్దారు వీవీ నరసింహారావు తెలిపారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి చేతుల మీదుగా దాణా పంపిణీ చేశారు. అలాగే వరద బాధితులకు ఆహార పొట్లాలను కూడా అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మండలంలోని వానపల్లి శివారు నారాయణలంక, కపిలేశ్వరపురం శివారు నారాయణలంక తదితర లంక గ్రామాల్లో పాడి రైతులకు బుధవారం సమీకృత దాణా పంపిణీ చేశారు. వరద ప్రభావిత లంక గ్రామాల్లో పాడి పశువులకు పశుగ్రాసంగా ప్రభుత్వం సరఫరా చేసిన సమీకృత దాణా పంపిణీ చేపట్టారు. దానిలో భాగంగా కపిలేశ్వరపురం పరిధిలో పశుసంవర్ధక శాఖ ఆలమూరు ఏడీ ఎల్.అనిత ఆధ్వర్యంలో 40 టన్నులు సమీకృత దాణా, 1.53 టన్నులు ఎండు గడ్డి పంపిణీ చేశారు. వానపల్లి పరిధిలో 30 మంది రైతులకు 50 కేజీల చొప్పున 1500 కేజీల దాణా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు యడ్లపల్లి భగవాన్, వానపల్లి వెటర్నరీ అధికారి గెద్దాడ ప్రసాదరావు, హెచ్ఏలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం అజెండా


విశ్వేశ్వరాయపురంలో బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని విశ్వేశ్వరాయపురంలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల అధికారులకు తెలిసి జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. ఇటువంటి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్ ప్రజల పట్ల ఎంత బాధ్యతగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇక గ్రామాల్లో గుర్తించిన సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం పరంగా సీఎం అన్ని చర్యలూ తీసుకుంటున్నారని వివరించారు. నాడు–నేడులో పాఠశాలలను, ఆసుపత్రుల నిర్మాణం పూర్తి అవుతుందని, అలాగే గృహ నిర్మాణం కూడా త్వరలోనే మిగిలిన మండలాల్లో ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో కంచర్ల శేఖర్, గుబ్బల వీవీ సత్యనారాయణ, చెల్లుబోయిన పెద్దిరాజు, గుండుమేను శ్రీనివాస్ యాదవ్, చెల్లుబోయిన బుచ్చయ్య మాస్టారు, కొల్లాబత్తుల అశోక్‌కుమార్, సోమిశెట్టి మురళీ కృష్ణ, పెయ్యల చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరు నుంచి పెనికేరు వెళ్లే ఓఎన్‌జీసీ రోడ్డు మరమ్మతులు వేగవంతంగా జరుగుతున్నాయి. సర్పంచ్ వనుం చిన్నావతి పర్యవేక్షణలో అధికారుల బృందం రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను యంత్రాల సాయంతో తొలగింపు ప్రక్రియను బుధవారం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల పాటు తరచూ భారీ వాహనాలు ప్రయాణించడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీని వల్ల ఆరోడ్డు వెంబడి రోజు ప్రయాణిస్తున్న విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి రూ.మూడు లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో పెనికేరు పంచాయతీ పాలవకర్గం సత్వరమే మరమ్మతులను ప్రారంభించింది. మరో వారం రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డుల మంజూరు


అంబాజీపేటలో లబ్ధిదారుకు రేషన్‌కార్డు ఇస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేయనున్నామని ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం సామాజిక భవనంలో తహసీల్దార్ టి.మంగతాయారు అధ్యక్షతన నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మండలంలోని 258 మందికి నూతన రేషన్ కార్డులు అందజేశామన్నారు. రేషన్ కార్డు కావాల్సిన వారు ఆయా గ్రామాల్లో సచివాలయాల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్డులో పేరు మార్పు, చేర్పులు, బదిలీలు సచివాలయాల్లో చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి అండగా ఉండి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వాసంశెట్టి చిన బాబు, కొర్లపాటి కోటబాబు, ముత్తాబత్తుల ప్రశాంత్, మట్టా పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కుదుటపడిన లంక గ్రామాలు


వరద ముంపు నుంచి బయటపడిన కనకాయ లంక కాజ్ వేపై రాకపోకలు సాగిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాలు కుదుటపడ్డాయి. మండలంలో మొత్తం 9 లంక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్న విషయం విదితమే. కె.ఏనుగుపల్లి, మానేపల్లి శివారు శివాయలంక, పల్లిపాలెం, నాగుల్లంక శివారు పల్లిపాలెం, గుడ్డాయ లంక రహదారులపై బుధవారం వరద తగ్గడంతో సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే వరద ముంపు నుంచి బయట పడటంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు మాత్రం వరదల సీజన్ తగ్గే వరకూ పడవలపైనే రాకపోకలు సాగిస్తారు.

లంక గ్రామాల్లో వరద బాధితులకు అధికారులు సహాయక కార్యక్రమాలు ముమ్మరం చేశారు. మండలంలో వరద ముంపు బారిన పడిన కుటుంబాలకు ప్రభుత్వ సాయం పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. లంక గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యులు, అధికారులు చర్యలు చేపట్టారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు పశుగ్రాసం అందజేస్తున్నారు.

వరద ఉధృతికి దెబ్బతిన్న రోడ్లు


అప్పనపల్లిలో వరద ప్రవాహానికి పాడైపోయిన పంచాయతీరాజ్ రోడ్డు

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతికి తీర గ్రామాల్లోని రోడ్లు పాడైపోయాయి. వరద నీటి ప్రవాహానికి బ్లాక్ టాప్ లేచిపోయి మెటల్ కొట్టుకుపోయింది. గోదావరి వరద సాధారణ స్థాయికి చేరడంతో రోడ్లకు ఏర్పడిన నష్టం బయటపడుతోంది. అప్పనపల్లి నుంచి బి.దొడ్డవరం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. ఈ రోడ్డుపై బీటీ లేచిపోయి మెటల్ కొబ్బరి తోటల్లోకి కొట్టుకుపోయింది. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన అప్పనపల్లి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు కూడా దెబ్బతింది. అప్పనపల్లిలోని మొల్లేటివారిపాలెం పంచాయతీరాజ్ రోడ్డు కూడా ధ్వంసమైంది. పెదపట్నం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక ప్రాంతాల్లోని రోడ్లకు కూడా వరద ఉధృతి వల్ల నష్టం వాటిల్లింది. వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లను సిమెంట్ కాంక్రీట్ రోడ్లుగా ఆధునీకరించాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దెబ్బతిన్న రోడ్లకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని వేడుకుంటున్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ


వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జేసీ నూపూర్ అజయ్ తదితరులు


కోరివారి అగ్రహారంలో వరద బాధితులకు సాయం అందజేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మంగతాయారు


సఖినేటిపలిల్లో వరద ముంపు ప్రాంతాల్లో పంపిణీకి సిద్ధం చేస్తున్న ప్రభుత్వ సాయం

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, తదితర గ్రామాల్లోని వరద బాధితులకు బియ్యం, నిత్యావసరాలను స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపూర్ అజయ్, ఆర్డీవో ముక్కంటి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడ ప్రజలకు ప్రకృతి విపత్తులు ఏర్పడినా అక్కడ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయక చర్యలు చేపట్టి వారి కష్టాలను ఇట్టే తీరుస్తారని అన్నారు. వరద బాధితులకు 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగలక్ష్మమ్మ, డీటీ అశోక్ ప్రసాద్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, నాగుల్లంక, ముంజవరం గ్రామాల్లో వరద బాధిత కుటుంబాలకు బుధవారం ఆయన నిత్యావసరాలు అందజేశారు.

అంబాజీపేట: ఇటీవల వరదలకు ముంపు బారిన పడిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయాన్ని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ టి.మంగతాయారులు కోశివారి అగ్రహారంలో బుధవారం పంపిణీ చేశారు. వరద బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో రమణ, మట్టపర్తి సాంబశివరావు, ర్యాలి శ్రీనివాస వడయార్, నెల్లి సత్యనారాయణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: గతంలో ఏ ప్రభుత్వం ఆదుకోని విధంగా వరద బాధితులకు సహాయం అందించి వారిని ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే చిట్టిబాబు పర్యటించారు. సీఎం జగన్ ఎంతో ఔదార్యంతో వరద బాధితులకు ఉదారంగా సాయం అందజేస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నాయన్నారు. కేవలం ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా వివాదాలు సృష్టిస్తూ సహాయానికి అడ్డుపడుతున్నాయని చిట్టిబాబు ఆరోపించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, సర్పంచ్‌లు సుందరనీడి చిన్ని, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు కొమ్ముల జంగమయ్య, వాసంశెట్టి వెంకటరమణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు వాకపల్లి వీరాస్వామి, విప్పర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: స్థానిక సమతా కల్యాణ మండపంలో బుధవారం వరద ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వ పరంగా పంపిణీ చేయాల్సిన సరకులు, కూరగాయల కిట్లను రెవెన్యూ సిబ్బంది, వలంటీర్లు సిద్ధం చేస్తున్నారు. తహసీల్దార్ వై.రామకుమారి పర్యవేక్షణలో వీఆర్వోలు, వలంటీర్లు ఇందులో భాగస్వాములయ్యారు. మండలంలోని టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి లాకుపేట, సఖినేటిపల్లి లంక తదితర ముంపు గ్రామాల్లో వీటిని పంపిణీ చేయనున్నారు. డీటీ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ రామరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, నాయకులు పాల్గొన్నారు.